# నేత్రపర్వంగా శ్రీనివాసుని రథోత్సవం

**జనసముద్రం న్యూస్/ఏలూరు జిల్లా/అక్టోబర్ 26/ద్వారకాతిరుమల**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆశ్వయూజ తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. కనకపు కొండవంటి రథంపై ఉభయ దేవేరులతో స్వామివారు పురవీధుల్లో విహరించారు.

సాయంత్రం స్వామివారిని తోలక్కం వాహనంపై పురవీధుల్లో ఊరేగించి, రథంపై సింహాసనంపై కల్యాణమూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ ఎస్.వి. సుధాకర్ రావు, అనువంశిక ధర్మకర్త నివృత్తి రావు రథానికి బలిహారణ సమర్పించి రథయాత్రను ప్రారంభించారు.మేళతాళాలు, కోలాట భజనలు, విచిత్ర వేషధారణలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ రథం పురవీధుల్లో సాగింది. భక్తులు స్వయంగా రథాన్ని లాగి తరించారు.ఉదయం స్వామివారు పాండురంగ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రోజుకో



**రథంపై స్వామివారు**

అలంకారంలో స్వామివారు దర్శనమిస్తుండటంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఏర్పాట్లను



**పాండు రంగనాథుని అలంకరణలో భక్తులకి దర్శనమిచ్చారు.**

దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావు పర్యవేక్షించారు.

# విద్యార్థుల్లో నైతిక, ఆధ్యాత్మిక విలువలు పెంపొందించాలి: మెట్టు గోవిందరెడ్డి

**- శ్రీ స్వామి వివేకానంద 164వ జయంతి పురస్కరించుకొని విద్యార్థినీ, విద్యార్థులకు జాగృతి పోటీలు నిర్వహణ**

**- విజేతలకు బహుమతులు పంపిణీ చేసిన రామకృష్ణ సేవా సమితి ట్రస్ట్**

**జనసముద్రంన్యూస్, మాచర్ల నియోజకవర్గం, అక్టోబర్ 26;** విద్యార్థులు విద్యార్థి దశ నుంచే దేశభక్తి, క్రమశిక్షణ, నైతిక, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించుకొని, మంచి పౌరులుగా ఎదగాలని శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు, స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద 164వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని, రామకృష్ణ మఠం రాజమండ్రి వారి సౌజన్యంతో శ్రీ రామకృష్ణ సేవా సమితి, మాచర్ల వారి ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు



నిర్వహించిన జాగృతి పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు పంపిణీ చేశారు. మాచర్ల (రూరల్) మండలం కంభంపాడు గ్రామంలోని, కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో నైతిక, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించాలనే ఉద్దేశంతో ప్రతి పాఠశాల, కళాశాలలో 'వివేకానంద ఫర్ యూత్' పుస్తకం ఆధారంగా జాగృతి పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం అలవర్చుకొని సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె. సైదమ్మ, శ్రీ రామకృష్ణ సేవా సమితి సభ్యులు కంచెర్ల జగన్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.